క్లుప్తంగా

మాజీ సర్పంచుల సంఘం కన్వీనర్‌గా మల్లేశ్


రాంటెంకి మల్లేశ్

దహెగాం: తెలంగాణ మాజీ సర్పంచుల సంక్షేమ సంఘం సిర్పూర్(టి నియోజకవర్గ కన్వీనర్‌గా మండలంలోని కోత్మీర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రాంటెంకి మల్లేష్ నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ మాజీ సర్పంచ్‌లకు ప్రతీనెల రూ.10వేలు పెన్షన్ అందజేయాలన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, భూమి లేని వారికి రెండెకరాల భూమి, మరణిస్తే కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం, మాజీ సర్పంచుల సంక్షేమం కోసం రూ.100 కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

సీసీరోడ్లతో గ్రామాలకు మహర్దశ


సీసీరోడ్డును పరిశీలిస్తున్న నాయకులు

దహెగాం: మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్మిస్తున్న సీసీరోడ్లతో గ్రామాలకు మహర్దశ కలుగుతుందని మండల రైతుబంధు సమితీ కన్వీనర్ సంతోష్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని కోత్మీర్, బీబ్రా, ఐన, బొర్లకుంట గ్రామాల్లో నిర్మిస్తున్న సీసీరోడ్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆయన వెంట సర్పంచ్‌లు బండ క్రిష్ణమూర్తి, మధూకర్, జయేందర్ నాయకులు ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు సిమ్‌కార్డులు పంపిణీ

దహెగాం: మండలంలో ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు 13 మందికి సిమ్‌కార్డులను శనివారం ఎంపీడీవో రాజేశ్వర్ గౌడ్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్‌లు గ్రామాల్లోని కూలీలకు పని కల్పించాలన్నారు. కమ్యూనికేషన్ పెంచుకోవడానికి సిమ్‌కార్డులు అందించినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఈజీఎస్ ఏపీవో కల్పన, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

సమయపాలన పాటించాలి


విద్యార్థితో చదివిస్తున్న ఎంఈవో

కెరమెరి: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని మండల విద్యా ప్రత్యేకాధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. శనివారం మండలంలోని లేండిగూడ, ఇంద్రాగర్, ఖైరీ పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థులతో చదివించారు. బోర్డుపై రాయించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని పేర్కొన్నారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాతకు పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

కౌటాల: మండల కేంద్రంలోని సదాశివపేట కాలనీలో గల శ్రీ వాసవీమాత ఆలయంలో శనివారం మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ వాసవీమాత అమ్మవారి పీఠం, సిద్ధిపేట అర్చకుడు బుక్క శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులు పాలు, పుష్పాలతో అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని జగన్నాథ్‌పూర్ గ్రామంలో ఈజీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని శనివారం ఎంపీడీవో గౌరీశంకర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. సర్పంచ్ డోకె రవి, ఎంపీటీసీ సిండె శ్యాంరావు, ఉపసర్పంచ్ దుర్గం రాజు, ఈజీఎస్ ఏపీవో సోహెబ్, తదితరులు పాల్గొన్నారు.

ఇక అధికారికంగా..!

- వారసంత నిర్వహణకు చర్యలు
- ప్రజల డిమాండ్ మేరకు దిగొచ్చిన అధికారులు
- వేలంలో రూ.90వేలు పలికిన ధర
- హర్షం వ్యక్తం చేస్తున్న మండల వాసులు


కూరగాయలు కొంటున్న వినియోగదారులు


చింతలమానెపల్లి వారసంత

చింతలమానెపల్లి: వారసంత ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించుకున్నారు.. ప్రజాప్రతినిధులకు సమస్య తెలియజేశారు.. అయినా ఫలితం లేక పోవడంతో గ్రామస్తులే కమిటీగా ఏర్పడి ప్రజల సౌకర్యార్థం వారసంత నిర్వహించారు. కాగా గ్రామస్తుల డిమాండ్ మేరకు దిగొచ్చిన పంచాయతీ అధికారులు చింతలమానెపల్లి వారసంత నిర్వహణకు చర్యలు చేపట్టారు. ఈనెల 24న వేలం కూడా నిర్వహించారు.

ఎన్నో వినతులు..

పరిపాలన సౌలభ్యం కోసం ఉన్నతాధికారులు చింతలమానెపల్లిని మండలంగా ఏర్పాటు చేశారు. రెవెన్యూ, ఎంపీడీవో కార్యాలయం, పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసి మండలంలో ప్రజలకు ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. కాని మండల కేంద్రంలో వారసంత లేకపోవడంతో మండల కేంద్రం ప్రజలతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం మండలంలోని రవీంద్రనగర్, కౌటాల, బెజ్జూర్ మండలాలకు వెళ్లాల్సిన పరిస్థితులు ఉండేవి. స్థానికంగా మార్కెట్ లేకపోవడంతో గ్రామస్తులకు ఉపాధి కూడా లేకుండా పోయింది. ఈ క్రమంలో స్థానికంగా వారసంత ఏర్పాటు చేయాలని మండల కేంద్రం వాసులు జిల్లా పంచాయతీ అధికారులకు, మండల స్థాయి అధికారులకు ఎన్నోసార్లు విన్నవించారు. కాని అధికారులు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో వారసంత అధికారికంగా అందని ద్రాక్షగా మిగిలింది.

కమిటీగా ఏర్పడి..

చింతలమానెపల్లి గ్రామ సర్పంచ్‌పై సస్పెన్షన్ వేటు పడడంతో గ్రామపంచాయతీలో పంచాయతీ కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో వారసంత సమస్య మరింత జఠిలంగా మారింది. వారసంత ఏర్పాటుపై పలుమార్లు చర్చికున్న గ్రామస్తులు, సంత ఏర్పాటు కోసం అడహక్ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. పార్టీలకు, వర్గాలకు అతీతంగా ఐక్యంగా కమిటీలో గ్రామస్తులు సభ్యులుగా ఉండి సంత ఏర్పాటుకు తీర్మానం చేశారు. ప్రతీ బుధవారం వారసంతను నిర్వహించేందుకు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం సమీపంలో గల స్థలాన్ని చదును చేశారు. ఈమేరకు అనధికారికంగా 7, సెప్టెంబర్, 2022న వారసంత నిర్వహించారు. కాగా గ్రామస్తులు వారసంతను నిర్వహిస్తుండడంతో పంచాయతీ అధికారులు దిగొచ్చి వారసంత నిర్వహణకు చర్యలు చేపట్టారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ అధికారులు 24న వారసంత నిర్వహణకు గ్రామపంచాయితీ కార్యాలయంలో వేలం నిర్వహించారు. వేలంలో వారసంత రూ.90వేల ధర పలికింది.

పలువురికి ఉపాధి



మండల కేంద్రంలో వారసంత ఏర్పాటు చేయడంతో దూరప్రాంతాలకు వెళ్లి సరుకులు కొనే ఇబ్బంది తప్పింది. స్థానికంగా కూరగాయలు పండించే వారికి ఉపాధి కూడా లభిస్తుంది.

\- పాండవుల మల్లేశ్, చింతలమానెపల్లి

వసతులు కల్పించాలి..



చింతలమానెపల్లిలో వారసంత నిర్వహణ ద్వారా ప్రజలు ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు. ప్రభుత్వం వారసంతకు స్థలం కేటాయించాలి. వసతులు ఏర్పాటు చేయాలి.

\- జగదీశ్ తివారీ, చింతలమానెపల్లి

సౌకర్యాలు కల్పిస్తాం



వారసంత నిర్వహణకు ప్రభుత్వ స్థలం కోసం తహసీల్దార్‌కు పంచాయతీ తీర్మానం అందజేశాం. స్థలం కేటాయిస్తే ఉపాధిహామీ పథకం ద్వారా షెడ్లను ఏర్పాటు చేస్తాం. తాత్కాలికంగా నిర్వహిస్తున్న వారసంతలో పార్కింగ్, ఇతర వసతుల కోసం చర్యలు తీసుకుంటున్నాం.

\- ఆసిఫ్ అలీ, పంచాయతీ కార్యదర్శి

కోర్టు ఉద్యోగుల సంఘం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ కోర్టు ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని శనివారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీఏవో రత్నరాజు తెలిపారు. అధ్యక్షుడిగా సంజీవ్‌కుమార్ ఎన్నిక కాగా, ఉపాధ్యక్షులుగా గులాబ్, ప్రధాన కార్యదర్శిగా పర్వేజ్, కోశాధికారిగా మధుకర్, ఉపాధ్యక్షులుగా ఫ్లోరెన్స్, శ్రీదేవి, సుమలత, సహాయ కార్యదర్శులుగా రమేశ్, శేఖర్, ప్రధాన కార్యదర్శిగా జయంత్‌రావ్, ప్రచార కార్యదర్శిగా నాగేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

రేపు వారసంత వేలం

రెబ్బెన: గోలేటి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రతీ గురువారం నిర్వహించే వారసంత వేలం సోమవారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సర్పంచ్ పోటు సుమలత, పంచాయతీ కార్యదర్శి జలందర్‌లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపై ఆసక్తి ఉన్న అభ్యర్థులు రూ.20వేల డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చని వారు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంచాయతీలకు జిల్లాస్థాయి పురస్కారాలు


కౌటాల సర్పంచ్ మౌనిశ్‌ను సన్మానిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

రెబ్బెన: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ జిల్లాస్థాయి పురస్కారం మండలంలోని నంబాలకు దక్కింది. శనివారం కలెక్టర్ హేమంత్ సహదేవరావు, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మిల చేతుల మీదుగా నంబాల సర్పంచ్ చెన్న సోమశేఖర్ అవార్డు అందుకున్నారు. సర్పంచ్‌తో పాటు పంచాయతీ కార్యదర్శి పుష్పలతను శాలువాతో సన్మానించి పురస్కారం అందజేశారు. జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు, జెడ్పీటీసీల ఫోరం అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

కౌటాల సర్పంచ్‌కు సన్మానం

కౌటాల: కౌటాల గ్రామపంచాయతీ సర్పంచ్ వొజ్జల మౌనిశ్‌ను జిల్లా కేంద్రంలో శనివారం జిల్లా కలెక్టర్ హేమంత్ సహదేవరావు బోర్కడే, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, ఎమ్మెల్యే ఆత్రం సక్కు శాలువాతో సన్మానించి పురస్కారం అందించారు. అవార్డు అందుకున్న సర్పంచ్ మౌనిశ్‌ను ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఎంపీవో మౌనిక అభినందించారు.

సీపీఐ జనరల్‌బాడీ వాల్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

రెబ్బెన: మంచిర్యాలలో నేడు నిర్వహించనున్న సీపీఐ ఉమ్మడి జిల్లా జనరల్ బాడీ సమావేశానికి సంబంధించిన వాల్ పోస్టర్లను శనివారం గోలేటిలోని కేఎల్ మహేంద్రభవన్‌లో పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి దుర్గం రవీందర్ మాట్లాడుతూ సమావేశంలో పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పార్టీ మండల కార్యదర్శి దుర్గం రవీందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సయ్య, ఏఐఎస్‌ఎఫ్ మండల కార్యదర్శి బాలునాయక్, నాయకులు శ్రీనివాసరావు, రాకేష్, రమేష్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల తహసీల్దార్‌గా సాయన్న


సాయన్నను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కౌటాల: కౌటాల తహసీల్దార్‌గా ఎస్. సాయన్న శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. అనంతరం సాయన్నను రెవెన్యూ సిబ్బంది సన్మానించారు.

తహసీల్దార్‌ను సన్మానించిన ప్రజాప్రతినిధులు

తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సాయన్నను శనివారం ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, మాలి సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. సర్పంచ్ ఆదే శ్రీనివాస్, మోర్లె రమేష్, ఉపసర్పంచ్ తిరుపతి, లహంచు పటేల్, మాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్‌రావు, నాయకులు రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, బాపు, సంతోష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. నిర్వహణ లేక నిరుపయోగం



కౌటాల: కౌటాల విద్యావనరుల కేంద్రం ఆవరణలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజల సౌకర్యార్థం నిర్మించిన మూత్రశాలలు నిరుపయోగంగా మారాయి. మూత్రశాలలకు నీటి సరఫరా లేకపోవడంతో వినియోగంలోకి రావడం లేదు. దీంతో కొందరు ఆరుబయటే కానిస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది.

సంబంధిత అధికారి: డి. సోమయ్య, ఎంఈవో
ఫోన్ నంబర్: 9398637063

గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు తినాలి


కౌటాల: అవగాహన కల్పిస్తున్న అధికారులు


కెరమెరి: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

కెరమెరి: గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, కూరగాయలు బాగా తినాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కుమారి, లత అన్నారు. 'పోషణ్ పక్వాడ్' పక్షోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని సుల్తాన్‌గూడ, రింగన్‌ఘాట్ గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా పుట్టాలంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్ బైనాబాయి, ఏఎన్‌ఎం గంగా, అంగన్‌వాడీ కార్యకర్తలు స్రవంతి, అనసూయ, కవిత, అనిత, ప్రమీల, లింగుబాయి తదితరులు ఉన్నారు.

కాగజ్‌నగర్ పట్టణంలో..

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్‌లో శనివారం పోషణ్ పక్వాడాలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో రక్తహీనతపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని ఈ నెల 20 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు వివిధ వార్డుల్లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కిశోర బాలికలకు పరీక్షలు

పెంచికల్‌పేట్: పోషణ్ పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని చేడ్వాయి, సంజీవనగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లోని గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యపరీక్షలు, రక్తపరీక్షలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా మాట్లాడుతూ ప్రతీరోజు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత దరిచేరదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ, ఉన్నీసా బేగం, మహిళలు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

కౌటాల: ప్రతీ ఒక్కరు పోషకాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షకీరాబేగం అన్నారు. పోషణ్ మాసోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక బుద్ధవిహార్‌లో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ పావని, ఏఎన్‌ఎం రజిని, అంగన్‌వాడీ టీచర్లు జీజాబాయి, సుజాత, అనిత, సరోజ, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్
కుమురంభీం : బలగం
కాగజ్‌నగర్
వెంకటరమణ : బలగం

\- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	60
దోసకాయ	40
చామగడ్డ	80
వంకాయ	60
బీరకాయ	60
కాకరకాయ	50
బెండకాయ	60
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	40
సోరకాయ	60
చిక్కుడు కాయ	30
గోబి(పూల్)	40
క్యాబేజి	40

\-ఆసిఫాబాద్‌అర్బన్

స్వచ్ఛత ఉత్సవాల్లో ప్రజలకు అవగాహన


వార్డులో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో శనివారం స్వచ్ఛత ఉత్సవాల్లో భాగంగా ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ అంజయ్య, చైర్మన్ సద్దాం హుస్సేన్‌లు పిలుపునిచ్చారు. నిషేధిత ప్లాస్టిక్‌తో జరిగే అనర్థాలపై వివరించారు. స్వచ్ఛతపై వార్డుల్లో మహిళలు ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అష్రఫ్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి


డీఈవోకు ఫిర్యాదు చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఉపాధ్యాయుడు అష్రఫ్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని రిటైర్డ్ ఆర్మీ అసోసియేషన్ సభ్యులు శనివారం జిల్లా కేంద్రంలోని డీఈవో అశోక్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ శివ మాట్లాడుతూ మూడు నెలలు గడుస్తున్నా డీఈవో అష్రఫ్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దేవసేన, అష్రఫ్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినా డీఈవో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అతడిపై కేసు నమోదై 3 నెలలు గడుస్తున్నా పోలీసులు కూడా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు, పోలీసులు అష్రఫ్‌పై వెంటనే చర్యలు చేపట్టాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. డీఈవోను కలిసిన వారిలో ఆర్గనైజేషన్ సెక్రటరీ శివ, సహాయ కార్యదర్శి రమాకాంత్‌యాదవ్, ముఖేష్, విజయ్‌కుమార్, రిటైర్డ్ రేంజర్ సదానందం, తదితరులు ఉన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు గ్రూప్ 1 ప్రిలిమ్స్‌కు ఉచిత శిక్షణ కోసం బీసీ స్టడీ సర్కిల్, ఆదిలాబాద్ కార్యాలయంలో ఈనెల 28లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సత్యనారాయణరెడ్డి, స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌లు శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ తరగతులు ఈనెల 29వ తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు. అభ్యర్థులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, అన్ని స్టడీ సర్టిఫికెట్‌లు, 2 ఫొటోలు, గ్రూప్ 1 దరఖాస్తు పత్రాలతో సంప్రదించాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచితంగా పుస్తకాలు, స్టైఫండ్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సీపీఆర్‌పై శిక్షణ


శిక్షణ ఇస్తున్న డాక్టర్ సీతారాం నాయక్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో శనివారం సీపీఆర్‌పై ఏఎన్‌ఎం, ఆశాలు, వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సీతారాం నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ నేహా, డాక్టర్ అజీమ్‌లతో పాటు ఏఎన్‌ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాగా చదివి ఉద్యోగాలు సాధించాలి


అభ్యర్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

కెరమెరి: శ్రద్ధగా చదివి ఉన్నతంగా ఎదగాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. శనివారం గోయగాం గ్రామ పంచాయతీలో నిరుద్యోగ అభ్యర్థుల కోసం ఏర్పాటు చేసిన రీడింగ్ రూంను ఆయన పరిశీలించారు. వివిధ పరీక్షల కోసం ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. బాగా చదివి ఉద్యోగాలు సాధించాలన్నారు. అనంతరం నర్సరీని పరిశీలించి మొక్కలకు సరిపడా నీరు అందించాలన్నారు. ఆరోగ్య సబ్‌సెంటర్‌ను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి బొజ్జిరావు ఉన్నారు.